క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం



పర్వతగిరి : స్థానిక ఎస్సై ప్రవీణ్‌ను ముదిరాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ అల్లాడి నర్సయ్య, మండల అధ్యక్షుడు రావుల రాజు, యూత్ విభాగం మండల అధ్యక్షుడు పిట్టల రాజు, సహాయ కార్యదర్శి ఉడుతబోయిన కృష్ణ, ఉపాధ్యక్షుడు అల్లాడి ఎల్లస్వామి, ధోని దేవేందర్, కార్యదర్శి గుర్రం యాదగిరి, కోశాధికారి పులుగుజ్జ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు..



నర్సంపేట రూరల్ : ఇటీవల డిగ్రీ లెక్చరర్ (డీఎల్)గా ఉద్యోగం పొంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిన చింతకాయల శంకర్‌ను నర్సంపేట మండలంలోని గురిజాలలో మత్స్య శాఖ అధ్యక్షుడు సున్నపు భిక్షపతి ఆధ్వర్యంలో బుధవారం ముదిరాజ్ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ఉపాధ్యక్షుడు పొన్నం రాజు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దేవేందర్, రాజు మాట్లాడారు. శంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల సదానందం, కొక్కు రాజమౌలి, చింతకాయల రాజు, కొక్కు రాంరాజ్, సున్నపు ఐలయ్య, కొక్కు జంపయ్య, రాజమౌళి, ముద్రబోయిన ఏకాంబ్రం, చింతకాయల రాజు, పెండ్యాల మల్లేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



దుగ్గొండి : మండల కేంద్రంలోని జాగృతి హైస్కూల్‌లో 2010–11 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో బుధవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులైన గుండెకారి రవికుమార్, రంగారావు, విజేందర్, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, బాలాజీలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కష్టాల్లో ఉన్న సహచర మిత్రులకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో వినయ్, అజయ్, విజయ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ 'యూత్' కార్యవర్గం ఎన్నిక



చిరంజీవి



కుమారస్వామి

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో నేతాజీ యువజన సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన చిరంజీవి, ఉపాధ్యక్షుడుగా పోలె రాజు, కార్యదర్శిగా గాలి కుమారస్వామి, కోశాధికారిగా బైరగోని కట్టమల్లు, సహాయ కార్యదర్శులుగా ఊద్గుల కుమారస్వామి, జంగిలి రమేశ్, సభ్యులుగా వల్లె రాజు, కుమార్, కుమారస్వామి, శ్రీనివాస్, సోమయ్య, సలహాదారులుగా బాషబోయిన ఐలయ్య, బెల్లి యాకస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చిరంజీవి, కార్యదర్శి కుమారస్వామి మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవలు నిర్వహిస్తామని, ప్రజాచైతన్యానికి కృషి చేస్తామని చెప్పారు.

ప్రభుత్వ భూమి కాపాడాలని వినతి

సంగెం : మండలంలోని తీగరాజుపల్లిలోని సర్వే నంబర్ 48లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని ఎంసీపీఐయూ మండల కార్యదర్శి ఇస్మాయిల్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్‌కు రాజ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం ఇస్మాయిల్ సమస్యను తహసీల్దార్‌కు వివరించారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న భూకాబ్జాదారుల నుంచి కాపాడి హద్దులు నిర్ణయించాలని కోరారు.

యువతి అదృశ్యం

దామెర : యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని పసరగొండలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ యువతి ఈ నెల 13న ఇంట్లో నుంచి అర్ధరాత్రి బయటకు వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం బంధువుల ఇళ్లతోపాటు స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పర్వతగిరి : ముగ్గులు వేస్తున్న మహిళలు



సంగెం : తిమ్మాపూర్‌లో..



ఘనంగా సంక్రాంతి, కనుమ

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట, సంగెం, గీసుకొండ, పర్వతగిరి, చెన్నారావుపేట, రాయపర్తి, తదితర మండలాల్లో సంక్రాంతి, కనుమ పండుగలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు గొబ్బెమ్మలను అలంకరించిన ముగ్గులతో మహిళలు, బాలికలు సందడి చేశారు. హరిదాసుల, గంగిరెద్దుల వాళ్లు అలరించారు. నర్సంపేట, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు మాధవరెడ్డి, నాగరాజు, తదితర ప్రముఖులు ముగ్గుల, క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.



చెన్నారావుపేట : గంగిరెద్దుతో విన్యాసం



రాయపర్తి : విజేతలతో ఝాన్సీ రాజేందర్‌రెడ్డి

వేడుకగా శబరిమల జ్యోతి దర్శనం



అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో మకర జ్యోతి

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శబరిమల జ్యోతి దర్శన కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. తొలుత అయ్యప్పస్వామి ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణంలో ఊరేగించారు. అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రధాన రహదారి మీదుగా తీసుకురాగా మాలదారులు, భక్తులు మంగళవాయిద్యాలతో టపాసులు పేల్చుతూ దర్శనం చేసుకున్నారు. ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడిలోని స్వామి వారికి అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ శిఖరంపై వెలిగించిన మకర జ్యోతుల దర్శనాన్ని ప్రజలు తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, శ్రీరాముల శంకరయ్య, బండారుపల్లి చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, వజినపల్లి శ్రీనివాస్, దొడ్డ వేణు, మల్యాల రాజు, భరత్, కార్తీక్, ఆలయ గుమస్తా దేశీరాం, తదితరులు పాల్గొన్నారు.

గుడ్డు.. ధరాభారం

- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇబ్బందులు

వర్ధన్నపేట : కోడి గుడ్డు ధర ఆకాశన్నంటుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భారంగా మారింది. సోమ, బుధ, శుక్ర వారాల్లో విద్యార్థులకు గుడ్డు అందించాలన్నది నిబంధన. కాగా గుడ్డు ధర నానాటికీ పెరుగుతండడంతో వారంలో ఒకటి, రెండు సార్లు మాత్రమే ఇస్తున్న దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో విద్యార్థులకు పోషకాహారం దూరమవుతోందన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. సకాలంలో బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం గుడ్డుకు రూ.5 చెల్లిస్తుండగా మార్కెట్‌లో ప్రస్తుత ధర రూ.7 ఉంది. గుడ్డు ఇవ్వకపోతే నిబంధనల ఉల్లంఘన, ఇస్తే అప్పుల పాలవు తామని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెలలో 12 సార్లు ఇవ్వాలి

మధ్యాహ్న భోజనం పథకంలో వారంలో మూడు సార్లు చొప్పున విద్యార్థులకు నెలలో 12 సార్లు గుడ్డు ఇవ్వాలి. ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తుండడంతో ఒక్కొక్కరిపై అదనంగా నెలకు రూ.24 భారం పడుతోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారం భరించలేక కొన్ని పాఠశాలల్లో గుడ్డుకు బదులుగా రాగి జావ ఇస్తున్న దుస్థితి నెలకొంది. నష్టాన్ని భరిస్తూ కొన్ని స్కూళ్లలో నిర్వాహకులు గుడ్డు అందజేస్తున్నారు.



ఇంక ఎంత పెరుగుతుందో..

గడచిన ఐదు నెలల్లో గుడ్డు భారీగా పెరిగిందన్నది జగమెరిగిన సత్యం. గతంలో ఎప్పుడూ ఇంతగా పెరగలేదు. ఆగస్టులో ధర రూ.5.70 ఉండగా ప్రస్తుతం రూ.7కు చేరింది. రానున్న రోజుల్లో ఇంక ఎంతగా పెరుగుతుందోనని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

గుడ్డు ధర పెరగడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పడుతున్న భారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అన్ని పాఠశాలల్లో వారంలో మూడు సార్లు విద్యార్థులకు గుడ్డు అందించాల్సిందే. ఇందులో ఎలాంటి మినహాయింపు లేదు.

– శ్రీధర్, ఎంఈఓ, వర్ధన్నపేట

చికిత్స పొందుతున్న మహిళ మృతి

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణానికి చెందిన కందికొండ స్వప్న(37)కు కొద్ది రోజులు తన మానసికస్థితి సరిగా లేదు. పది రోజుల క్రితం ఇంట్లో ఉన్న ఎలుకల మందు తినడంతో కుటుంబ సభ్యులు గమనించి 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హనుమకొండ, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. మృతురాలికి భర్త కందికొండ శ్రీను, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలో దొంగల బీభత్సం

- తాళం వేసిన ఉన్న రెండు ఇళ్లల్లో చోరీలు

వరంగల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి దైవ దర్శనానికి వెళ్లగా దొంగలుపడి సొత్తు దోచుకుపోయిన సంఘటన వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లో సోమవారం జరిగింది. కాలనీలోని రెండు ఇళ్లలో దొంగలు పడి బంగారు. వెండి అభరణాలతో పాటు కొంత నగదును దోచుకుపోయారని ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దూరి వినోద తమ కుటుంబ సభ్యులతో సోమవారం వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చే చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూడగా బెడ్రూంలోని బీరువా పగులగొట్టి అందులో ఉన్న సుమారు 4.5 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి ఆభరణాలతో పాటు కొంత నగదు దొంగలు దోచుకుపోయినట్లు గుర్తించారు. అలాగే, ఆ పక్కనే ఉన్న అన్నారపు రాజేందర్ కిరాణ షాపు తాళం పగులగొట్టి రూ.5,500లు అపహరించినట్లు గుర్తించారు. ఏనుమాముల పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి క్లూస్ టీంను రంగంలోకి దింపి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

దుర్గమ్మ ఆలయంలో పూజలు

ఖానాపురం : మండలంలోని నాజీతండాలోని జరిగిన దుర్గమ్మ ఆలయ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రం సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

దుగ్గొండి : మండలంలోని బిక్కాజిపల్లికి చెందిన ఆయిల్ ఇంజన్ మెకానిక్ బండారి నర్సయ్య (75) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందగా అతడి మృతదేహానికి నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కరెంట్ మోటార్లు రాక ముందు నుంచి ఆయిల్ ఇంజన్ మెకానిక్‌గా పని చేస్తూ డివిజన్‌వ్యాప్తంగా సేవలు అందించాడని కొనియాడారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గతంలో బిల్ కలెక్టర్‌గా పని చేసిన పెండోట రామ్మోహనాచారి (75) బుధవారం ఉదయం మృతి చెందగా ఆయన మృతదేహానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు పరామర్శించారు. రామ్మోహనాచారి మృతదేహానికి సీపీఎం నాయకులు ఈసంపల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, తదితరులు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మోడల్ స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ కలకొండ లక్ష్మణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. తొలుత లక్ష్మణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బాల్నె వెంకన్న, అనుముల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలులో నిర్లక్ష్యం సరికాదు



సంగెం : రైతులకు రుణమాఫీ అమలు చేయడంలో నిర్లక్ష్యం సరికాదని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అన్నారు. మండలంలోని కుంటపల్లిలో బుధవారం నిర్వహించిన రైతు సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతు భరోసా రూ.12 వేలు చొప్పున ఇస్తామనడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులకు రూ.2 లక్షల వరకు నగదు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, ఎకరానికి రూ.15 వేలు చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు రౌతు శ్రీనివాస్, సోమిడి రవి, ఐలయ్య, అశోక్, రాజు, రేణుక, సరోజన తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత

ఖిలా వరంగల్ : నేపాల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కోయంబత్తూర్‌కు కూలీ పనుల కోసం రైలు ఎక్కి వెళ్తుండగా ఓ వ్యక్తికి అనారోగ్య సమస్య తలెత్తడంతో అర్ధంతరంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఈనెల 11న సుభాష్‌సింగ్, సునీల్ సింగ్ పాస్వన్ ట్రైన్ దిగారు. సుభాష్‌సింగ్‌ను అక్కడే ఉంచి ఆస్పత్రి వివరాలు తెలుసుకునేందుకు సునీల్ వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో జనగామ రైల్వేస్టేషన్‌లో సునీల్ ప్రత్యక్షమయ్యాడు. అతడిని సుభాష్‌కు అప్పగించినట్లు జీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ వివరించారు.

బాధితుడికి సూట్‌కేస్..

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫారంపై విలువైన సూట్‌కేస్‌ను మర్చిపోయి ట్రైన్ దిగి ఇంటికి ప్రయాణికుడు వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో బుధవారం ఆ సూట్‌కేసును గుర్తించి బాధితుడికి అందజేసినట్లు జీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు.

నేటి నుంచి అన్నారం దర్గా ఉర్సు



ఉత్సవాలకు సిద్ధమైన అన్నారం షరీఫ్ దర్గా



నల్లబెల్లి : గిలాఫ్ సమర్పిస్తున్న సుదర్శన్‌రెడ్డి



దర్గా పరిసరాలను పరిశీలిస్తున్న ఏసీపీ తిరుపతి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ యాకూబ్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు నేడు (గురువారం) నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఖవ్వాలి, గంధం ఊరేగింపు ఉంటుంది. శుక్రవారం దీపారాధన, భక్తులకు మహా అన్నదానం నిర్వహిస్తారు. శనివారం ఖత్మల్ ఖురానాలతో ఉత్సవాలు ముగుస్తాయి. దర్గా వద్ద హిందువులు, ముస్లిములు మతాలకు అతీతంగా మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. కోళ్లు, యాటలతో కందూరు చేస్తారు.

గంధం ఊరేగింపునకు బందోబస్తు

అన్నారం షరీఫ్ గంధం ఊరేగింపు కోసం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ రాజగోపాల్ తెలిపారు. మామునూరు ఏసీపీతోపాటు ఐదుగురు ఎస్సైలు, వంద మంది పోలీసు సిబ్బంది పాల్గొంటారని ఆయన చెప్పారు. ఉత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఉత్సవాలకు రూ.8.50లక్షల మంజూరు

అన్నారం ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ వక్ఫ్‌బోర్డు రూ.8.50 లక్షలు మంజూరు చేసిందని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ చెపాపరు. దర్గాతోపాటు చిల్లాల పెయింటింగ్, తాగునీరు, శానిటేషన్, టాయిలెట్స్, ఇతర సదుపాయాలు కల్పిస్తామని, అన్నదానం చేస్తామని, ఏర్పాట్లు పూర్తి అయ్యాయని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం

అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని ముజేవర్ ఖాజాపాషా తెలిపారు. ముజేవార్ల ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోందని ఆయన చెప్పారు. ముందుగా గంధానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో కలిసి యాకూబ్‌బాబా దర్గాలో గంధాన్ని సమర్పిస్తామని వివరించారు.

అందరూ సహకరించాలి

అన్నారంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉర్సుకు అందరూ సహకరించాలని మామునూరు ఏసీపీ తిరుపతి అన్నారు. ఈ మేరకు అన్నారం దర్గా ఉర్సు ఏర్పాట్లను బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్, ఎస్సై భోగం ప్రవీణ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

గిలాఫ్ సమర్పణ

నల్లబెల్లి : అన్నారం షరీఫ్ దర్గాకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బుధవారం గిలాఫ్ సమర్పించారు. తన నివాసంలో ముస్లిం మత పెద్దల సమక్షంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిలాఫ్ సమర్పించి మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించేలా అల్లా దీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాషా, నాయకులు నయీముద్దీన్, నాగెల్లి వెంకట్‌నారాయణ గౌడ్, మునిగాల వెంకట్‌రెడ్డి, రాయిడి రవీందర్ రెడ్డి, బానోత్ సారంగపాణి, కక్కెర్ల శ్రీనివాస్, గోనె యువరాజు, కొత్తపల్లి కోటిలింగాచారి, సద్దాం హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : ధ్వజస్తంభం వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



పర్వతగిరి : మల్లికార్జునస్వామిని పూజిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



వైభవంగా జాతరలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా జాతరలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు చోట్ల ప్రభ బండ్లు ఆకట్టుకున్నాయి. పట్నాలు వేశారు. బోనాలు సమర్పించారు. గీసుకొండలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర, చెన్నారావుపేట మండలంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి జాతర, రాయపర్తి మండలంలోని పెర్కవేడు మల్లికార్జునస్వామి జాతర, పర్వతగిరి గోపనపల్లిలో దూడల మల్లికార్జునస్వామి ఉత్సవాలు నిర్వహించారు. వర్ధన్నపేట నల్లబెల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, నాగరాజు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : గోదాదేవి కల్యాణంలో అర్చకులు, భక్తులు



రాయపర్తి : పట్నాలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



సంగెం : పర్వతాల మల్లికార్జునస్వామి ఆలయంలో..

అర్హులకు పథకాలు అందించడమే ధ్యేయం

- ఏడీఏ దామోదర్‌రెడ్డి, అధికారులు

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్ర ప్రభుత్వ అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తదితర సంక్షేమ పథకాలను అర్హులకు అందించడమే ధ్యేయంగా నేటి (గురువారం) నుంచి సర్వేలు, సభలు నిర్వహించాలని నర్సంపేట ఏడీఏ దామోదర్ రెడ్డి, ఎంపీడీఓలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, సునీల్‌కుమార్, కృష్ణవేణి, రవీందర్, నల్ల శ్రీవాణి, కిషన్, తహసీల్దార్లు రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, రియాజుద్దీన్, ఫణికుమార్, శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్లు భాగ్యలక్ష్మి, సురేశ్, బాలకృష్ణ, నాగమణి కోరారు. నెక్కొండ, నర్సంపేట, ఖానాపురం, గీసుకొండ, సంగెం, చెన్నారావుపేట, రాయపర్తి మండల పరిషత్ కార్యాలయాల్లో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓలు, తహసీల్దార్లు దిశానిర్దేశం చేశారు. ఈనెల 20 వరకు అర్హులను గుర్తించాలని చెప్పారు. పథకాలకు సంబంధించి గ్రామసభలు, సర్వేలు, క్షేత్రస్థాయి పరిశీలనలు తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు.



నెక్కొండ : మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్